క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

పులివెందుల రూరల్ : పులివెందుల పట్టణంలో మంగళవారం ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు విద్యుత్‌శాఖ ఏఈ జగదీశ్వర్‌రెడ్డి తెలిపారు. పులివెందుల పట్టణంలోని పార్నపల్లె రోడ్డు విస్తరణకు సంబంధించి కరెంటు లైన్ షిఫ్టింగ్ పనులు జరుగుతున్నాయన్నారు. ఈ కారణంగా పార్నపల్లె రోడ్డు ప్రాంతంలో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందన్నారు.

ఎన్‌ఏఎస్‌పై అవగాహన సదస్సు

ఎర్రగుంట్ల : నేషనల్ అచీవ్‌మెంట్ సర్వే (ఎన్‌ఏఎస్)పై జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో సోమవారం అవగాహన సదస్సు నిర్వహించారు. మండల విద్యాధికారులు శివప్రసాద్, వెంకటేశ్వర్లు మాట్లాడుతూ ఈ కార్యక్రమంలో భాగంగా మండల వ్యాప్తంగా ఎంపిక చేసిన 22 పాఠశాలల్లోని ప్రధానోపాధ్యాయులకు శిక్షణ ఇచ్చామన్నారు. నవంబర్ 3వ తేదీన పరీక్ష నిర్వహిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో హెడ్మాస్టర్ రామాంజనేయరెడ్డి, ఉపాధ్యాయుడు చంద్ర ఓబుళరెడ్డి పాల్గొన్నారు.

కాంగ్రెస్ బలోపేతానికి కృషి

పులివెందుల రూరల్ : పులివెందుల నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి కృషిచేస్తానని ఆ పార్టీ పులివెందుల మండల అధ్యక్షుడు కేతిరెడ్డి తిరుపాల్‌రెడ్డి అన్నారు. సోమవారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ బీజేపీపై ప్రజలకు నమ్మకం పోయిందన్నారు. 2024 ఎన్నికల్లో రాహుల్ గాంధీ ప్రధాని కావడం తథ్యమన్నారు.

వృద్ధులకు అన్నదానం

లింగాల : లింగాల మండల కేంద్రానికి చెందిన మాధవీలత 14వ వర్ధంతిని పురస్కరించుకుని వృద్ధులకు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇప్పట్ల గ్రామ సమీపంలోని లీలావతి చారిటబుల్ ట్రస్ట్ వృద్ధాశ్రమంలో మాధవీలత తల్లిదండ్రులు అలవలపాటి అనంతమ్మ, పాపిరెడ్డిల ఆధ్వర్యంలో మాధవీలత కుమార్తెలు సుష్మారెడ్డి, హారికరెడ్డిలు అన్నదానం చేశారు.

తాగునీటి పథకం ప్రారంభం

ముద్దనూరు : మండలంలోని చెన్నారెడ్డి పల్లె గ్రామంలో ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి రక్షిత తాగునీటి పథకాన్ని ప్రారంభించారు. సోమవారం మాజీ ఎంపీపీ మునిరాజారెడ్డితో కలిసి ఎమ్మెల్యే రూ.5లక్షల వ్యయంతో నిర్మించిన వాటర్‌ప్లాంట్‌ను ప్రారంభించారు. మండలపరిషత్ 15వ ఆర్థిక సంఘం నిధుల ద్వారా ఈ పథకం మంజూరైనట్లు ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ హుసేన్ తెలిపారు. ప్రజలకు రక్షిత తాగునీటి సరఫరాకు ప్రాధాన్యం ఇస్తున్నట్లు ఎమ్మెల్యే తెలిపారు.

ఆన్‌లైన్ మట్కా కేసులో అరెస్టు

ముద్దనూరు : సెల్‌ఫోన్ ద్వారా ఆన్‌లైన్ మట్కా ఆడుతున్న ఐదుగురిని అరెస్టు చేసినట్లు సీఐ నరేష్‌బాబు తెలిపారు. వారి వద్దనుంచి రూ.8200 స్వాధీనం చేసుకున్నామన్నారు.

మినుము పంటలో సస్యరక్షణ చర్యలు అవసరం

వీరపునాయునిపల్లె : మినుము పంటలో సస్య రక్షణ చర్యలు చేపట్టాలని కమలాపురం వ్యవసాయ సహాయ సంచాలకుడు నరసింహారెడ్డి అన్నారు. పాయసంపల్లె, వీరపునాయునిపల్లె గ్రామాల్లో సాగు చేసిన మినుము పంటను సోమవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రస్తుతం వర్షాభావ పరిస్థితులు ఏర్పడడంతో పొగాకు లద్దెపురుగు ఉధృతి అధికంగా ఉన్నట్లు గుర్తించామన్నారు. మండల అధ్యక్షుడు రఘునాథరెడ్డి మాట్లాడుతూ రైతు భరోసా కేంద్రాల్లో పంటలపై తీసుకోవాల్సిన జాగ్రత్తలపై రైతులకు అవగాహన సదస్సులు నిర్వహించాలని సూచించారు. మండల వ్యవసాయ అధికారి శ్యామ్‌బాబు, వ్యవసాయ సహాయకులు ఇంతియాజ్, రామాంజులు, రైతులు పాల్గొన్నారు.

గ్రామాల్లో పారిశుధ్య చర్యలు చేపట్టాలి

జమ్మలమడుగు రూరల్ : రాబోవు వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకుని అధికారులు గ్రామాల్లో పారిశుధ్య చర్యలు చేపట్టాలని మండల ఎంపీపీ గుద్దేటి హరిత అన్నారు. సోమవారం మండల సర్వసభ్య సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ వర్షాలు పడితే దోమలు ప్రబలి మలేరియా, డెంగీ తదితర విష జ్వరాలు వచ్చే అవకాశం ఉందన్నారు. రాష్ట్ర హజ్ కమిటీ చైర్మన్ బి. గౌస్‌లాజం మాట్లాడుతూ ప్రభుత్వ పథకాలు ప్రజల్లోకి తీసుకెళ్లాలని ఆయన సూచించారు. ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, డిప్యూటీ తహసీల్దార్ వేణుగోపాల్, ఎంపీడీఓ చెన్నా రాఘవేంద్రనాథ్ పాల్గొన్నారు.

ఐక్యతతోనే సమగ్రాభివృద్ధి

వేంపల్లె : దేశసమగ్రత, అభివృద్ధికి ఐక్యత పునాది వంటిదని వైఎస్సార్ వివేకానంద ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ యోగాంజనేయులు అన్నారు. జాతీయ సమైక్యత వారోత్సవాల్లో భాగంగా సోమవారం 'ఐక్యత కొరకై పరుగు' అనే కార్యక్రమాన్ని కళాశాల ఎన్ఎస్ఎస్ యూనిట్, ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాల ఎన్‌సీసీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేశారు. ఎస్ఐ తిరుపాల్‌నాయక్ , ఎంఈఓ వీరారెడ్డి , ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ ఓబుల్ రెడ్డి, ఎన్‌సీసీ ఆఫీసర్ గోపాల్‌నాయక్, పీడీలు రాజశేఖర్, తేజేంద్ర పాల్గొన్నారు.

తొగట వీర క్షత్రియ సంఘం ఉపాధ్యక్షుడిగా సుబ్రమణ్యం

చెన్నూరు : తొగట వీర క్షత్రియ రాష్ట్ర యువజన సంఘం ఉపాధ్యక్షునిగా తనను నియమించినట్లు వేల్పుల సుబ్రహ్మణ్యం తెలిపారు. ఈ సందర్భంగా ఆయనను పలువురు రామనపల్లె గ్రామస్తులు, తదితరులు సన్మానించారు.

ప్రైవేటుకు దీటుగా వైద్య సేవలు

- ప్రభుత్వ ఆసుపత్రులపై జనం భరోసా
- రోగులతో రద్దీగా పులివెందుల ఏరియా ఆసుపత్రి
- సీఎం వైఎస్ జగన్ సంస్కరణలతో ప్రజల్లో పెరిగిన నమ్మకం



పులివెందుల ప్రభుత్వ ఏరియా ఆసుపత్రి

పులివెందుల : పేదలు ప్రైవేటు ఆసుపత్రుల్లో వైద్య చికిత్సలు పొందాలంటే భయపడే రోజులు.. ఇక ప్రభుత్వ ఆసుపత్రుల్లో మొక్కుబడిగా వైద్యం అందిస్తారని, వైద్యులు పెద్దగా పట్టించుకోరని జనం తరచూ చేసే ఫిర్యాదులు. కానీ సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి వైద్య విధానంలో తీసుకొచ్చిన సంస్కరణల ఫలితంగా ప్రభుత్వ ఆసుపత్రులపై జనానికి భరోసా కలిగింది. ఈ క్రమంలో వైద్యులు, నర్సులు, సిబ్బంది అంకిత భావంతో సమష్టిగా పనిచేయడంతో పులివెందుల ఏరియా ఆసుపత్రి రోగులతో కిటకిటలాడుతోంది. ఒకప్పుడు రోజుకు 200 దాటని ఓపీ నేడు 650 మందికి పైగా ఆసుపత్రికి వస్తుండడం మార్పునకు కొలమానంగా భావించవచ్చు. నియోజకవర్గం చుట్టుపక్కల నుంచి పెద్ద సంఖ్యలో రోగులు పులివెందుల ఏరియా ఆసుపత్రికి తరలివస్తుంటారు. ఉదయం 9 గంటల నుంచి ఓపీ సేవలు ప్రారంభం కావడంతో ఆసుపత్రి ఆవరణం రద్దీగా మారుతోంది. ఆసుపత్రిలో రోగులను బాగా చూసుకుని మంచి వైద్యం అందిస్తున్నారనే నమ్మకంతో ప్రజలు పెద్ద సంఖ్యలో వస్తున్నారు. ప్రైవేట్ ఆసుపత్రికి వెళ్లి వేలకు వేల రూపాయలు ఫీజులు చెల్లించే స్తోమత లేని పేదలు ప్రభుత్వ ఆసుపత్రిలోనే నాణ్యమైన వైద్యసేవలు అందుతుండడంతో ఎలాంటి ఇబ్బందులు పడకుండా ధైర్యంగా ఆసుపత్రికి వెళ్లి ఆరోగ్యంగా ఇళ్లకు తిరిగి వెళ్తున్నారు. పులివెందుల ఏరియా ఆసుపత్రిలో రోజుకు 650 మందికి పైగా అవుట్ పేషెంట్లు, 50 నుంచి 60 వరకు ఇన్‌పేషెంట్లు చికిత్స పొందుతున్నారు. ఆసుపత్రిలో అభివృద్ధి కార్యక్రమాల కారణంగా పూర్తి స్థాయిలో ఇన్‌పేషెంట్లను చేర్చుకోలేకపోతున్నారు.

నలుగురు వైద్యులతో నెట్టుకొచ్చి..

పులివెందుల ఏరియా ఆసుపత్రిలో గతంలో కేవలం నలుగురు వైద్యులతో నెట్టుకొచ్చారు. మిగిలిన విభాగాల వైద్యుల పోస్టులు ఖాళీగా ఉండేవి. దీంతో ఉన్న సిబ్బంది కూడా చేసేదేమీ లేక వేరే ప్రాంతాలకు బదిలీలకు ప్రయత్నాలు సాగించారు. దీంతో రోగులు ప్రైవేట్ ఆసుపత్రులకు వెళ్లి చికిత్సలకు అయ్యే ఖర్చులు భరించలేక అప్పులు చేసి ఇబ్బందులు పడుతుండేవారు. నేడు ఆ పరిస్థితి పూర్తిగా మారిపోయింది. సీఎం వైఎస్ జగన్ తీసుకొచ్చిన సంస్కరణల్లో భాగంగా వైద్యులు పూర్తిస్థాయిలో ఉండేలా ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి చొరవ తీసుకోవడంతో నేడు అన్ని విభాగాలకు వైద్యులు అందుబాటులోకి వచ్చారు. ఎన్నో ఏళ్లుగా ఖాళీగా ఉన్న పోస్టులు సైతం నేడు భర్తీ అయ్యాయి. గైనకాలజిస్టు, చిన్నపిల్లల వైద్యుడు, కంటి వైద్యుడు, సర్జన్స్, అనస్తీషియా, ఆర్థోపెడిక్, దంతవైద్యుడు, ఫిజియోథెరపీ, జనరల్ ఫిజిషియన్, ఇలా అన్ని విభాగాలకు డాక్టర్లు అందుబాటులోకి వచ్చారు. ప్రస్తుతం అన్ని విభాగాలకు వైద్యులు అందుబాటులోకి వచ్చి చికిత్స అందిస్తున్నారు. మరోవైపు శస్త్ర చికిత్స కూడా చేస్తున్నారు. ప్రస్తుతం రేడియాలజిస్టు పోస్టు మాత్రమే ఖాళీగా ఉంది. మిగిలిన అన్ని పోస్టులు భర్తీ అయ్యాయి.

ఐదు మండలాల నుంచి..

పులివెందుల, లింగాల, సింహాద్రిపురం, తొండూరు, వేముల మండలాల నుంచి ప్రజలు ఆసుపత్రికి వస్తుంటారు. ఎక్కువగా గైనకాలజీ, కంటి, చిన్న పిల్లల, ఆర్థోపెడిక్ విభాగాల చికిత్స కోసం వచ్చే వారు ఉంటారు. ఇక్కడ పనిచేస్తున్న వైద్యులు స్థానిక ప్రైవేట్ వైద్యులకు దీటుగా వైద్య సేవలు అందిస్తుండడంతో ఎక్కువ మంది ఆసుపత్రికి వచ్చేందుకు ప్రజలు సుముఖత చూపుతున్నారు.

సిబ్బంది సమష్టి కృషి

ఏరియా ఆసుపత్రికి అనుబంధంగా ఉన్న 30 మంది ఏఎన్ఎంలు పల్లె ప్రజలతో మమేకమయ్యారు. గర్భిణులు, బాలింతల ఇళ్లకు వెళ్లి అవసరమయ్యే సూచనలు, వ్యాక్సిన్‌లు ఇప్పించడంలో వీరే కీలకం. దీంతో పాటు ఆసుపత్రిలోని వైద్యులు, ఇతర సిబ్బంది అధిక సంఖ్యలో రోగులు ఆసుపత్రికి వచ్చేలా తమ వంతు సమష్టి కృషి చేస్తున్నారు.

గర్భిణులపై ప్రత్యేక కేర్..

గర్భిణులపై వైద్య సిబ్బంది ప్రత్యేకంగా జాగ్రత్తలు తీసుకోవడంతో ఎక్కువ మంది ప్రైవేటు ఆసుపత్రులకు వెళ్లకుండా ప్రభుత్వ ఆసుపత్రికే వస్తున్నారు. అలాగే ప్రసవాల సమయంలో వారిని ప్రత్యేక వార్డుల్లో పెట్టి ఎక్కువ భాగం సాధారణ ప్రసవాలకే అధిక ప్రాధాన్యం ఇస్తున్నారు. దీంతో ప్రభుత్వ వైద్యులపై నమ్మకం పెరిగి ప్రభుత్వ ఆసుపత్రికి వచ్చేందుకు ఆసక్తి కనబరుస్తున్నారు.



ఎక్స్‌రే తీస్తున్న సిబ్బంది

వివిధ రకాల ఆరోగ్య పరీక్షలు..

వివిధ రకాల రక్తపరీక్షలు, ఎక్స్‌రే, అల్ట్రాసౌండ్ స్కానింగ్ మొదలైన పరీక్షలు ఇక్కడే నిర్వహిస్తున్నారు. దీంతోపాటు ఆయా రోగాలకు సంబంధించి వైద్యులు రాసిచ్చిన మందులు చాలా వరకు అందుబాటులో ఉంటున్నాయి.

అందుబాటులో మంచి వైద్యం

మా పాప కీర్తనకు తీవ్ర జ్వరం రావడంతో ఆసుపత్రిలో అడ్మిట్ అయ్యాం. రక్తపరీక్షలు చేసి జ్వర నిర్ధారణ చేశారు. దీంతో రెండు రోజులుగా ఆసుపత్రిలోనే ఇన్‌పేషెంట్‌గా ఉన్నాం. వైద్యులు రౌండ్స్‌కు వచ్చి పాప హెల్త్ కండీషన్‌ను ఎప్పటికప్పుడు చూస్తున్నారు. ప్రస్తుతం జ్వరం తగ్గుముఖం పట్టింది. వార్డులో ఉండే నర్సులు బాగా చూసుకుంటున్నారు. మంచి వైద్యంఅందిస్తున్నారు.

– మెహతాజ్, యర్రగుడిపల్లె

వైద్యులు బాగా చూసుకుంటున్నారు

కాలుకు దెబ్బతగిలి ఆసుపత్రిలో ఇన్‌పేషెంట్‌గా అడ్మిట్ అయ్యాను. సిబ్బంది ఇక్కడ బాగా చూసుకుంటున్నారు. గాయం నయం అయ్యేందుకు కావాల్సిన మందులు కూడా అందిస్తున్నారు. రెండు రోజులుగా ఆసుపత్రిలోనే ఉంటున్నా.

– శ్రీనివాసులు, నగరిగుట్ట, పులివెందుల

నిబద్ధతతో పనిచేస్తున్నారు

ఆసుపత్రిలోని వైద్యుల భర్తీ విషయంలో సీఎం జగన్ సంస్కరణలు, ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి సూచనలతో ఓఎస్‌డీ అనిల్‌కుమార్‌రెడ్డి ప్రత్యేక శ్రద్ధ ఫలితంగా నేడు అన్ని విభాగాలకు సంబంధించిన డాక్టర్లు అందుబాటులోకి వచ్చారు. సిబ్బంది అందరూ సమష్టిగా పనిచేయడంతో ఎంతో దూరం నుంచి రోగులు ప్రభుత్వ ఆసుపత్రిపై నమ్మకంతో వస్తున్నారు. వారికి న్యాయం చేయాలనే ఆశయంతో అందరం సమష్టిగా పనిచేస్తున్నాం.

– డేవిడ్, సూపరింటెండెంట్, ఏరియా ఆసుపత్రి, పులివెందుల

అభివృద్ధికి చిరునామా వేముల

- రూ.4.81కోట్ల పాడా నిధులతో నిర్మాణాలు
- నేడు కడప ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డిచే ప్రారంభోత్సవాలు



ప్రారంభానికి సిద్ధంగా ఉన్న మోడల్ పోలీస్ స్టేషన్

వేముల : మండల కేంద్రమైన వేముల అభివృద్ధికి చిరునామాగా నిలుస్తోంది. వేములను అన్ని రంగాల్లో అభివృద్ధి చేసేందుకు మండల ఇన్‌చార్జి నాగెళ్ల సాంబశివారెడ్డి, జెడ్పీటీసీ కె.వెంకట బయపురెడ్డి, ఎంపీపీ చల్లా గంగాదేవిలు తీవ్రంగా కృషి చేస్తున్నారు. నియోజకవర్గంలోనే వేములను అభివృద్ధిలో అగ్రగామిగా నిలపాలనే దృఢనిశ్చయంతో అభివృద్ధిపనులను వేగవంతం చేసి పూర్తి చేయించారు. పాడా నిధులతో అభివృద్ధిలో వేములను ముందుకు తీసుకెళ్లడంలో వీరు కీలకపాత్ర పోషిస్తున్నారు. ఇప్పటికే వేములలో రూ.4.81కోట్ల పాడా నిధులతో నిర్మాణాలు పూర్తిచేసి ప్రారంభోత్సవానికి సిద్ధం చేశారు. మండల కేంద్రంలో ఎన్నో ఏళ్లుగా వైద్యసేవలు అందిస్తున్న ప్రాథమిక ఆరోగ్య కేంద్రం రూపురేఖలు మార్చివేశారు. మండల వాసులకు మెరుగైన వైద్య సేవలు అందించాలన్న లక్ష్యంతో అధునాతన సౌకర్యాలతో రూ.1.85కోట్ల పాడా నిధులతో నూతన భవనాలను నిర్మించారు. అలాగే రూ.1.75 కోట్లతో నూతనంగా మోడల్ పోలీస్ స్టేషన్‌ను నిర్మించారు. పాడిరైతులను ప్రోత్సహించాలన్న ఉద్దేశంతో రూ.48లక్షల పాడా నిధులతో బల్క్ మిల్క్ సెంటర్‌ను పూర్తి చేశారు. మరో రూ.45లక్షలతో సచివాలయం, రూ.28లక్షలతో రైతు భరోసా కేంద్రాలను నిర్మించి అందుబాటులోకి తీసుకొచ్చారు. వీటిని మంగళవారం ప్రారంభించేందుకు ఏర్పాటు చేస్తున్నారు.

నేడు నూతన భవనాలు ప్రారంభించనున్న ఎంపీ

వేములలో మంగళవారం కడప ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి పర్యటించనున్నారు. నూతనంగా నిర్మించిన ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, మోడల్ పోలీస్ స్టేషన్, బల్క్ మిల్క్ సెంటర్, సచివాలయం, రైతు భరోసా కేంద్రాలను ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి ప్రారంభిస్తారని మండల ఇన్‌చార్జి నాగెళ్ల సాంబశివారెడ్డి తెలిపారు. వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొనాలని కోరారు.

కేసీ కెనాల్‌కు నీటి విడుదలకు మార్గం సుగమం

– ఎమ్మెల్యే రవీంద్రనాథ్‌రెడ్డి చొరవ

వల్లూరు : కేసీ కెనాల్ కింద ఇప్పటికే పలువురు రైతులు పలు పంటలను సాగు చేశారు. వర్షాభావ పరిస్థితుల నేపథ్యంలో నీటి ప్రాజెక్టులలో నీటి మట్టాలు పూర్తిగా తగ్గిపోవడంతో కేసీ కెనాల్‌కు నీటి సరఫరా నిలిచి పోయింది. ఈ క్రమంలో చెన్నూరు మండలానికి చెందిన పలువురు కేసీ కెనాల్ ఆయకట్టు రైతులు ఎమ్మెల్యే పీ రవీంద్రనాథరెడ్డిని కలిశారు. ఇప్పటికే సాగు చేసిన పంటల పరిస్థితి ప్రశ్నార్థకంగా మారిందని, కనీసం నవంబర్ మాసం వరకు కేసీ కెనాల్‌కు నీరు వస్తే పంటలు గట్టెక్కుతాయని, నీటిని విడుదల చేయించి ఆదుకోవాలని కోరారు. దీనిపై వెంటనే స్పందించిన ఆయన విజయవాడ ఈఎన్‌సీ అధికారులతో, ఇరిగేషన్ అధికారులతో పాటు జిల్లా కలెక్టర్‌కు సమస్యను గురించి వివరించారు. కేసీ కెనాల్‌కు నీటిని విడుదల చేసి రైతులను ఆదుకోవాలని కోరారు. దీంతో అధికారులు స్పందించారు. మైలవరం రిజర్వాయర్ నుండి పెన్నా నది ద్వారా నీటి విడుదల చేసి ఆదినిమ్మాయపల్లె వద్ద గల కేసీ కెనాల్ పికప్ పాయింట్ ద్వారా పొలాలకు మళ్లించాల్సి ఉండగా మైలవరం రిజర్వాయర్‌లో నీటి మట్టం చాలా తక్కువగా వుండడంతో పరిస్థితులు అనుకూలించలేదు. దీంతో అధికారులు మొదట గండి కోట రిజర్వాయర్ నుండి మైలవరం రిజర్వాయర్‌కు నీటిని విడుదల చేయడానికి చర్యలు చేపట్టారు. మైలవరం రిజర్వాయర్‌లో నీటి మట్టం పెరగగానే బుధవారం నుండి పెన్నా నదికి నీటిని విడుదల చేయనున్నారు. ఈ క్రమంలో శుక్రవారం నుండి ఆదినిమ్మాయపల్లె ఆనకట్ట వద్ద నుండి కేసీ కెనాల్‌కు నీటిని విడుదల చేసి ఇప్పటికే సాగు చేసిన పంటల రక్షణకు అవకాశం కల్పించనున్నారు. ఎమ్మెల్యే చొరవతో అధికారులు స్పందించి నీటి విడుదలకు చర్యలు చేపట్టడంపై రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

దివ్యాంగులకు గృహోపకరణాలు వితరణ

పులివెందుల టౌన్ : స్థానిక వికలాంగుల నెట్‌వర్క్ కార్యాలయంలో బలపనూరు కొత్తపల్లె గ్రామానికి చెందిన పెద్దిరెడ్డి, జయభారతి దంపతులు దివ్యాంగులకు గృహోపకరణాలతో పాటు దుప్పట్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వికలాంగుల నెట్‌వర్క్ రాష్ట్ర అధ్యక్షుడు రఘునాథరెడ్డి మాట్లాడుతూ తమ తల్లి సుభద్రమ్మ స్మారకార్థం దివ్యాంగులకు సేవ చేయడం అభినందనీయమన్నారు.

గడప గడపకూ సంక్షేమ పథకాలు

పెద్దముడియం : సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు గడప గడపకు చేరుతుండటంతో ప్రజలంతా సంతోషంగా ఉన్నారని ఎమ్మెల్యే డాక్టర్ ఎం.సుధీర్ రెడ్డి, ఎమ్మెల్సీ పి.రామసుబ్బారెడ్డి తెలిపారు. సోమవారం వారు వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు సురేష్ బాబుతో కలిసి గుండ్లకుంట గ్రామంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు ఇంటింటికి వెళ్లి ఆప్యాయంగా పలకరించి సంక్షేమ పథకాలు అందుతున్నాయా లేదా అని అడిగి తెలుసుకున్నారు. నాలుగేళ్లలో ప్రభుత్వం నుంచి పొందిన లబ్ధిని వివరించి సంక్షేమ క్యాలెండర్‌ను అందించారు. ఇంకా ఏమైనా సమస్యలుంటే తమ దృష్టికి తీసుకురావాలని సూచించారు. అనంతరం వారు మాట్లాడుతూ ఎన్నికల ముందు ఇచ్చిన హామీలు 90 శాతం అమలు చేసి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి చరిత్రలో నిలిచిపోయారన్నారు. కుల,మత, రాజకీయాలకు అతీతంగా ప్రభుత్వ పథకాలు అందిస్తున్న జగనన్నకు మరోసారి అండగా నిలవాలని ప్రజలను కోరారు. కార్యక్రమంలో ప్రభుత్వ ఉద్యాన సలహాదారు సంబటూరు ప్రసాద్ రెడ్డి, పి.గిరిధర్ రెడ్డి, కామేశ్వరరెడ్డి, నియోజకవర్గ పరిశీలకుడు కల్లూరు నాగేంద్ర రెడ్డి, మండల కన్వీనర్ చవ్వా క్రిష్టారెడ్డి, విశ్వనాథ రెడ్డి, క్రిష్టారెడ్డి, సుధీర్ రెడ్డి, భరత్ రెడ్డి, గ్యాస్ శివా రెడ్డి, నరసింహులు, మండల స్థాయి అధికారులు, సచివాలయ ఉద్యోగులు ,వలంటీర్లు పాల్గొన్నారు.



లబ్ధిదారుడికి బుక్‌లెట్ అందజేస్తున్న ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు

వృద్ధాశ్రమంలో అన్నదాన కార్యక్రమం



వృద్ధులకు అన్నదాన కార్యక్రమం నిర్వహిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు, అభిమానులు

వేంపల్లె : మండల జగనన్న సచివాలయాల కన్వీనర్ శ్రీనివాసులు (సర్పంచ్) పుట్టినరోజు వేడుకలను వైఎస్సార్‌సీపీ నాయకులు, అభిమానులు ఘనంగా నిర్వహించారు. సోమవారం స్థానిక రాజీవ్‌నగర్ కాలనీలోని మదర్‌థెరిస్సా అనాథ వృద్ధాశ్రమంలో వృద్ధులకు ఉదయం అల్పాహారం పంపిణీ చేశారు. అలాగే పాత గండిరోడ్డులో ఉన్న మదర్‌థెరిస్సా ఛారిటబుల్ ట్రస్ట్ వృద్ధాశ్రమంలో అనాథ వృద్ధులకు అన్నదానం నిర్వహించారు. స్థానిక 7వ సచివాలయంలో సచివాలయ కన్వీనర్లు, గృహసారథులు, సిబ్బంది. వార్డు మెంబర్ బండల షుకూర్ ఆధ్వర్యంలో పంచాయతీ సిబ్బంది కూడా వేడుకలు నిర్వహించారు. వైఎస్సార్‌సీపీ యువ నాయకుడు ఆదినారాయణరెడ్డి మాట్లాడుతూ పుట్టినరోజు వేడుకలను అనాథ వృద్ధుల మధ్య నిర్వహించడం చాలా సంతోషంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో సచివాలయ కన్వీనర్లు పుల్లయ్యతోట నగేష్, బ్రహ్మానందకుమార్, ముత్యాల రమేష్‌బాబు నాయకులు, కార్యకర్తలు నాగేంద్ర, మహేష్, చాంద్‌బాషా, భూషణం, ఆదినారాయణ, దివాకర్, రామకృష్ణ, యోగ, బండికేశవ, లోకేష్, గణేష్, అంజి, ప్రసాద్, శ్రీకాంత్, బాబు, సుబ్బయ్య, శివ, పవన్, తదితరులు పాల్గొన్నారు.

ముంపు గ్రామస్తులకు నివాస గృహాలు మంజూరు

- భూమిపూజ చేసిన పాడా ఓఎస్‌డీ అనిల్‌కుమార్‌రెడ్డి



భూమిపూజ చేస్తున్న పాడా ఓఎస్‌డీ అనిల్‌కుమార్‌రెడ్డి

వేంపల్లె : చక్రాయపేట మండలంలోని తక్కల్లపల్లి గ్రామం వద్ద కాలేటి వాగు ప్రాజెక్టు కింద ముంపు గ్రామ ప్రజలకు నివాస గృహాలను ప్రభుత్వం మంజూరు చేసింది. సోమవారం పాడా ఓఎస్‌డీ అనిల్‌కుమార్‌రెడ్డి, అధికారులు, ప్రజాప్రతినిధులతో కలిసి భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాలేటి వాగు ప్రాజెక్టు 0.25 టీఎంసీ ఉండగా దానిని 1.25 టీఎంసీ ఎత్తుకి పెంచే దిశగా రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి శ్రీకారం చుట్టారన్నారు. కృష్ణా జలాలను ఎర్రబొమ్మనపల్లి, గడ్డంవారిపల్లె గ్రామాల మీదుగా కాలేటి వాగు ప్రాజెక్టుకు నింపి లక్కిరెడ్డిపల్లె రామాపురం గ్రామాల చుట్టూ ఉన్న చెరువులకు నీటిని నింపాలనే ఉద్దేశంతో ప్రభుత్వం అడుగులు వేస్తోందన్నారు. రైతులకు ప్రతి ఎకరాకు నీరు అందించాలన్న లక్ష్యంతో ప్రభుత్వం ఈ చర్యలు తీసుకుందని తెలిపారు. ఈ క్రమంలో కాలేటి వాగు ప్రాజెక్టు ఎత్తు పెంచడంతో దిగువన ఉన్న తక్కల్లపల్లె గ్రామ ప్రజలకు ముప్పువాటిల్లే ప్రమాదం ఉందన్నారు. అందువల్ల ఆ గ్రామాన్ని ఖాళీ చేయించి వారికి వేంపల్లె ప్రభుత్వ పాలిటెక్నిక్ సమీపంలో ఇళ్ల స్థలాలను మంజూరు చేశామన్నారు. మొత్తం 80 కుటుంబాలకు నివాస స్థలాలను మంజూరు చేయగా వాటికి అధికారులు ప్రజాప్రతినిధులు భూమిపూజ చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీలు మాధవి బాలకృష్ణ, లక్ష్మీగాయత్రి, మండల కన్వీనర్ చంద్ర ఓబుల్‌రెడ్డి, సర్పంచ్ మునేష్, తహసీల్దార్ రాజసింహ నరేంద్ర, హౌసింగ్ ఏఈ శుక్రమారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

జగనన్న ఆరోగ్య సురక్ష పేదలకు వరం



సంపూర్ణ పోషణ స్టాల్స్‌ను పరిశీలిస్తున్న వైఎస్ మనోహర్‌రెడ్డి, తదితరులు

పులివెందుల టౌన్ : రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న జగనన్న ఆరోగ్య సురక్ష పేదలకు వరం లాంటిదని మున్సిపల్ ఇన్‌చార్జి వైఎస్ మనోహర్‌రెడ్డి పేర్కొన్నారు. సోమవారం స్థానిక భాకరాపురం, నగరిగుట్ట అర్బన్ హెల్త్‌సెంటర్‌లలో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ భాకరాపురంలో 357 మందికి, నగరిగుట్ట అర్బన్ హెల్త్ సెంటర్‌లో 324 మందికి బీపీ, షుగర్, డెంగీ, మలేరియా, తదితర దీర్ఘకాలిక జబ్బులకు వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందించామన్నారు. అనంతరం అంగన్వాడీ వర్కర్లు ఏర్పాటు చేసిన వైఎస్సార్ సంపూర్ణ పోషణ కార్యక్రమంలో పౌష్టికాహారాన్ని పరిశీలించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ వరప్రసాద్, వైస్ చైర్మన్ హఫీజుల్లా, కమిషనర్ నరసింహారెడ్డి, సివిల్ సప్లై రాష్ట్ర డైరెక్టర్ హాల్ గంగాధరరెడ్డి, కౌన్సిలర్లు, వైఎస్సార్‌సీపీ నాయకులు, వివిధ రకాల జబ్బులకు సంబంధించిన వైద్యులు, ఏఎన్ఎంలు, ఆశావర్కర్లు, ఐసీడీఎస్, మున్సిపల్, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు, తదితరులు పాల్గొన్నారు.

పనులు సకాలంలో పూర్తి చేయండి

– పాడా ఓఎస్‌డీ అనిల్‌కుమార్‌రెడ్డి

పులివెందుల టౌన్ : పులివెందులలో జరుగుతున్న అభివృద్ధి పనులను సకాలంలో పూర్తి చేయాలని పాడా ఓఎస్‌డీ అనిల్‌కుమార్‌రెడ్డి సంబంధిత కాంట్రాక్టర్లకు సూచించారు. సోమవారం స్థానిక పాడా కార్యాలయంలో మున్సిపల్ ఇన్‌చార్జి వైఎస్ మనోహర్‌రెడ్డి, చైర్మన్ వరప్రసాద్, వైస్ చైర్మన్ హఫీజుల్లాలతో కలిసి ఆయన అభివృద్ధి పనుల పురోగతిపై కాంట్రాక్టర్లతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రతి కాంట్రాక్టర్ వారు చేపట్టిన పనులను సకాలంలో పూర్తి చేయాలన్నారు. కమిషనర్ నరసింహారెడ్డి, మున్సిపల్ ఇంజినీర్లు, పబ్లిక్ హెల్త్ ఇంజినీర్లు పాల్గొన్నారు.

వైఎస్ జగన్ అంటే సంక్షేమం

- వైఎస్ మనోహర్‌రెడ్డి



నాయకులకు హారతులు పడుతున్న మహిళలు

పులివెందుల టౌన్ : జగన్ అంటే సంక్షేమమని.. ప్రతి గడపకు సంక్షేమ పథకాలు అందివ్వడమే సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్య లక్ష్యమని మున్సిపల్ ఇన్‌చార్జి వైఎస్ మనోహర్‌రెడ్డి పేర్కొన్నారు. కడప ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి ఆదేశాల మేరకు సోమవారం స్థానిక రాజీవ్‌నగర్ కాలనీ సచివాలయ పరిధిలోని పార్నపల్లె రోడ్డు, రాజీవ్‌నగర్ కాలనీ, తదితర ప్రాంతాల్లో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. వార్డు కౌన్సిలర్ రాజేశ్వరి ఆధ్వర్యంలో వైఎస్ మనోహర్‌రెడ్డి, మున్సిపల్ చైర్మన్ వరప్రసాద్, సివిల్‌సప్లై రాష్ట్ర డైరెక్టర్ హాల్ గంగాధరరెడ్డి తదితరులు పాల్గొన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పేదరిక, మధ్యతరగతి అన్ని వర్గాల ప్రజలకు అండగా నిలబడి ఎన్నో సంక్షేమ పథకాలు అందించారని, ఆయన చేసిన మేలును మరువలేమంటూ మహిళలు వారికి హారతులు పట్టి స్వాగతం పలికారు. అనంతరం ప్రతి గడపకు వెళ్లి జగనన్న ప్రభుత్వంలో జరిగిన మంచిని వైఎస్ మనోహర్‌రెడ్డి వివరించారు. ప్రజల నుంచి వచ్చిన సమస్యలను అధికారుల ద్వారా వెంటనే పరిష్కరించారు. ఈ కార్యక్రమంలో కమిషనర్ నరసింహారెడ్డి, జేసీఎస్ ఇన్‌చార్జులు చంద్రమౌళి, పార్నపల్లి కిశోర్, కౌన్సిలర్లు కోడి రమణ, డేనియల్ బాబు, వైఎస్సార్‌సీపీ నాయకులు పద్మనాభరెడ్డి, రసూల్, మాజీ కౌన్సిలర్లు, బూత్ కమిటీ సభ్యులు, సచివాలయ కన్వీనర్లు, గృహసారథులు, మెప్మా, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

రైతన్నకు దన్నుగా రైతు భరోసా కేంద్రాలు



రైతు భరోసా కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే రవీంద్రనాథ్‌రెడ్డి

వీరపునాయునిపల్లె : రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన రైతు భరోసా కేంద్రాలు రైతన్నకు దన్నుగా నిలుస్తున్నాయని కమలాపురం ఎమ్మెల్యే పి.రవీంద్రనాథ్‌రెడ్డి అన్నారు. మండలంలోని పాయసంపల్లె, వీరపునాయునిపల్లెలో 44 లక్షల రూపాయల వ్యయంతో నిర్మించిన రైతు భరోసా కేంద్రాలను సోమవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రైతాంగానికి అవసరమైన అన్ని వనరులు రైతు భరోసా కేంద్రాల్లో అందుబాటులో ఉండేలా ప్రభుత్వం చర్యలు తీసుకుందన్నారు. రైతులు ఈ అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు రఘునాథరెడ్డి, కమలాపురం వ్యవసాయ సహాయ సంచాలకుడు నరసింహారెడ్డి, మండల వ్యవసాయ అధికారి శ్యామ్ బాబు, సర్పంచు సరోజినీదేవి, ఎంపీటీసీ సభ్యులు రామాంజనేయరెడ్డి, రాఘవ యాదవ్, వ్యవసాయ సలహా మండలి మండల అధ్యక్షుడు భాస్కర్‌రెడ్డి, గడ్డంవారిపల్లె సహకార సంఘం అధ్యక్షుడు సుదర్శన్‌రెడ్డి, స్థానిక నాయకులు చంద్రశేఖర్‌రెడ్డి, రామచంద్రారెడ్డి, లక్ష్మినారాయణ రెడ్డి, శ్రీనివాసులరెడ్డి తదితరులు పాల్గొన్నారు.